

# అసలు కథ

"సవారా"

కృష్ణారావు రాసిన కథ చాలా బాగుంది. అతను కాలేజీ మేగజైనులో రాసిన కథ అది. దానికి ఫస్టు ప్రయిజుకూడా వచ్చింది. కాని అది బాగా ఉందీ లేందీ అతను చెప్పలేడు. అతనికి ఆ కథ గురించి ప్రైజు ఇచ్చినట్లు చాలామందికి తెలియదు. కాని అతని కథ చాలా బాగుందని వాళ్ళు చదివి గ్రహించేరు. ఆ కథపేరు "మరణిస్తున్న మానవుడు."

కాలేజీ వేసంగి సెలవులయిపోయాక తెరిచేరు. చేరేవాళ్ళు చేరుతున్నారు. కాలేజీకి వస్తున్నాడు కృష్ణారావు. కేశవరావుకనబడి "ఒరే! మరణిస్తున్న మానవుడూ" అని పిలిచేరు. ఆ పిలుపు వినేసరికి తను వ్రాసిన కథ కదా అని జ్ఞాపకమొచ్చి ఖనయిపోయాడు కృష్ణారావు. కేశవరావు దగ్గిరకు వచ్చి "చాలా బాగా రాసేవురా కథ" అన్నాడు.

"ఏదో రాసేను" అన్నాడు కృష్ణారావు.

"అలా అనకుమరి చాలా ఫస్టుగావుంది థీమ్- అంతేగాకుండా ముగింపు చాలా అద్భుతంగా ఉంది. ఏరా వాసూ! అని ప్రక్కనున్న వాడి ఉద్దేశ్యంకూడా అడుగుతూ, కేశవరావు ఊరికే పొగిడేస్తున్నాడు కథని.

వాసు, "ముగింపుమాట అలా ఉంచుగాని, స్టయిల్ మాత్రం చాలా బాగా ఉంది" అని ఆ కథలోని మంచిమాటల కూర్పుని అప్పగించేయటం మొదలుపెట్టేడు.

ప్రక్కనున్న శివరాం, "మొత్తంమీద చాలా పైనుగా ఉంది కథ. మంచి క్లైమాక్సుకూడావుంది. పైగా చూశావా, అక్కడ ఆ హీరో ఆత్మహత్య చేసుకుంటూ ప్రపంచంగురించి అన్నమాటలు, చాలా ట్రెమెండస్ గా ఉన్నాయి" అన్నాడు.

ఇవన్నీ వినేసరికి కృష్ణారావుకి సంతోషంవల్ల జ్వరం వచ్చినట్టయింది. వాళ్ళతో "ఏదో ఇదే ఫస్టు టైమురా" అని క్షమార్పణ చెప్పుకుంటున్నట్టుగా అనేసి ముందుకు సాగిపోయాడు.

ఎదురుగా తన ప్రాణ స్నేహితుడు ప్రకాశరావు కనబడి "యేరోయ్ కవీ!" అన్నాడు. ఇతను కథ రాస్తే ఏకంగా అతను కవీ అనే అనేసాడు. నవ్వుకున్నారు ఇద్దరూ, ఇంతట్లో రాజారావు కనబడి "కృష్ణారావ్! నీవు రాసింది చదివేను. మాబలేగా ఉందిలే" అన్నాడు వాడి కంగ్రాట్యులేషన్స్‌కి కృష్ణారావూ, అతనితోపాటు మన ఫ్రెండుకింత గొప్పవస్తూందికదాని గర్వంతో ప్రకాశరావూ, చెరో చిరునవ్వు సమర్పించి క్లాసురూమ్ వైపు నడిచేరు.

క్లాసురూమ్‌కి గరల్సు వెయిటింగురూమ్ ముందునుంచి వెళ్తున్నారు స్నేహితులిద్దరూ వీళ్ళ క్లాసు మేట్లు సుభద్రావాళ్ళూ వెయిటింగ్ రూమ్ బయటనే వరండాలో నిలబడి హస్కు వేసుగుంటున్నారు. మనవాళ్ళు చెరోకన్నూ అటు పారేసారు. సుభద్ర వీళ్ళని ఓ ఫస్టు ఇయర్ అమ్మాయికి కృష్ణారావును చూపించి నవ్వుతూ, ఆశ్చర్యంగా ఏదో చెప్పింది. "ఓహో! అలానా" అని సుభద్రకు ఓ చిరునవ్వు పారేసి, ఓరగా కృష్ణారావును చూసింది ఆ అమ్మాయి. కృష్ణారావు కిల్ అయిపోయాడు దెబ్బతో. అయి

పోయి "చూశావా" అన్నట్టుగా ప్రకాశరావుని చూశాడు, ప్రకాశం, "అవును" అన్నట్టుగా తల పంకించి "సుభద్ర ఏమిటి చెప్తూతుందంటావ్, నిన్ను చూపించి" అన్నాడు.

కృష్ణారావు అప్పుడే ఊహించేశాడు. కాని చెప్పకుండా "ఏమోరా! అదే నాకూనూ"

"నీ కథగురించేమోరా" అన్నాడు ప్రకాశం.

"కరక్ట్! నేను అలానే అనుకున్నాను" అన బోయి; మానేసి "ఊ! అలాగే ఉంది" అని నసిగాడు కృష్ణా,

"ఇంకా అలాగే ఉంది అంటావేమిరా! అంతే, నేను చెప్పిందే రైటు," ఏమిటి. నేను ఊహించింది తప్పకూడానా, అన్నట్టుగా సిద్ధాంతీకరించాడు ప్రకాశం.

కృష్ణారావు "మళ్లీ వెనక్కి వెళ్దాంరారా. చూద్దాం మళ్లీ ని" అన్నాడు, ఈ సారి చూద్దామన్నట్టుగా

ముందుకు వెళ్లిపోయిన వాళ్ళల్లా, మళ్లా వెనక్కితిరిగి వెయిటింగురూమ్ వైపు వస్తున్నారు. ఇంకా అమ్మాయిలక్కడే ఉన్నారు. కృష్ణారావు అటు చూసేడు. ఆ "అమ్మాయి" ఇటే చూస్తూంది. సుభద్రతో ఇతన్ని చూపించి, ఏదో అంది, సుభద్ర నివ్వింది. కృష్ణారావుకి సంతోషం ముంచుకువచ్చి చిన్ననవ్వు వచ్చింది ప్రకాశాన్ని చూశాడు. ప్రకాశం "ఏరా! నేను చెప్పింది రైటేనా" అన్నాడు. "అవును" అని బుర్ర ఊపాడు కృష్ణారావు.

ఇంతలో "బెల్" కొట్టేరు. క్లాసుకు పోయారు స్నేహితులిద్దరు. ఇపుడయిన బెల్ "ఫస్టుబెల్" మాత్రమే, సెకండు బెల్కు ఇంకా అయిదునిమిషాలుంది క్లాసులోకి పోకుండా క్లాసుముందు వరండాలో నిలబడ్డారు మనవాళ్లు- అమ్మాయిలు గుంపులు గుంపులుగా వస్తున్నారు. ఇంతలో సెకండు బెల్ కూడా అయింది, కృష్ణారావుక్లాసుకి లెక్చరరుయింకా రావటంలేదు, కుర్రాళ్లు, వచ్చే అమ్మాయిలకు "పోజు"లు కొడ్తున్నారు, క్లాసుకు వెళ్తున్న "ఫస్టుఇయర్" అమ్మాయిల్లో ఇందాకటి అమ్మాయి ఎందుకో తలెత్తి చూసింది. కృష్ణారావు బలవంతంగా. ఆమె కళ్లల్లోకిచూసి, ఆమె కళ్లని తనవైపు తిప్పుకున్నాడు పొంగిపోయాడు. లెక్చరరు వచ్చేసాడు. క్లాసుకు పోయారు కుర్రాళ్ళు.

కృష్ణారావు ప్రయత్నంచేసి ఎలాగయితేనేం ఆ అమ్మాయిపేరు కనుక్కున్నాడు. సుశీల అని తెలుసుకున్నాడు "సుశీల, సుశీల" అని పది సార్లు అనుకున్నాడు. ఎలాగయినా, ఆ అమ్మాయిని వల్లో వేసేసుకోవాలని తలంచేడు. ముందు మాట్లాడి చూడాలనుకొన్నాడు. ఎలా మాట్లాడటం? తనకు తెలిసిన ప్రణయ కథల్ని నెమరు వేసుకున్నాడు, అవన్నీ కూడా అర్థంలేకుండా ఉన్నాయి. కొన్ని కథలు, ఎప్పుడో కలుసుకున్న తరువాతనుండి ప్రణయం మొదలయిన కథల్లా ఉన్నాయి. మరికొన్ని చిన్నతనంనుంచీ ఆడుకోవటంవల్ల వచ్చినట్టున్నాయి. ఇంకా కొన్ని ఏదో, హఠాత్తుగా జరిగిన సంఘటనలవల్ల ప్రేమ కలిగినట్లున్నాయి. అంతేగాని ఇలా ఓ కొత్తకుర్రాడు, అందులోనూ కాలేజీవాడు, పైగా కథరాసినవాడు, ఓకొత్త అమ్మాయిని ఎలా కదిపాడో ఆ అమ్మాయితో ఎలా మాటలు మొదలుపెట్టాడో. ఎలా రంగంలోకి దింపాడో చెపుతూ ఉన్న కథలు ఏవీ కనబడలేదు. ఎన్ని ప్రణయకథల మేగజైన్లు, పుస్తకాలు తిరిగేసినా మనవాడు చిక్కుకొన్న సమస్యలో ఏహీరో చిక్కుకోలేదు. సరే కొత్తగా ఏదో పద్ధతి మనమే కనిపెట్టి ప్రారంభోత్సవం చేద్దామనుకున్నాడు. ఆ అమ్మాయికి ముందరగా పోజులు చాలా ఎక్కువగా యిచ్చేసి, బాగా గుర్తుపట్టేం చేసుకోవాలనుకున్నాడు. అలానే తెగ ఇచ్చేసాడు పోజులు ఇతను చూస్తున్నప్పుడల్లా ఒక్కసారేనా, ఎదుకైనా ఇటువేపు చూసి, ఇతని కళ్ళల్లో కళ్ళు కలిపేది ఆ అమ్మాయి. ఇక మాట్లాడినా ఏమీ అనదనుకున్నంతగా చూపులు జరిగి- కృష్ణారావు "పోజుల" ఘట్టం

లోంచి, "మాట్లాడే" ఘట్టంకోసం కాసుక్కూచున్నాడు. ఇన్ని ఘట్టాలలోనూ దిగి, సఫలుడవితేనే గాని. ప్రణయ నదిలో మునిగి కోరిక నెరవేరటం జరుగదు. అందుకని సమయంకోసం ఎదురు చూస్తున్నాడు.

అవేళ మీటింగు జరుగుతూంది. పోజు కొట్టడానికి వీలయిన చోటు చూసుగుని కుదిరాడు కృష్ణారావు. ఆ "సుశీల" వైపు చూస్తున్నాడు ఆమె కూడా చూసింది ఇతని కళ్ళుచూసేసరికి ఏదో అనుకుంది. ఎంతసేపట్నుంచో, చూస్తున్నట్టనాన్నదనిపించి—మొగం త్రిప్పేసుకున్నదలా, మళ్ళా కాస్సేపటికి—ఇంకా చూస్తున్నాడో లేదో అనుమానంవేసి, చూద్దామని మళ్లీ చూసింది. ఇంకా అతనలానే చూస్తున్నాడు. మొగం త్రిప్పేసుకుంది. మళ్లీ చూడాలనిపించి మళ్లీ చూసింది. అటు ఎటో చూస్తున్నవాడల్లా కృష్ణారావు, సడన్‌గా ఇటు తిరిగి చూసాడామెని, ఆమె ఇదిచూసి గబుక్కున మొగం తిప్పేసుకుంది. "అమ్మ! నేనటు చూస్తూంటే, నామొగంవైపు ఎలా చూస్తూందో! నేను చూసేసరికి మళ్ళా అటు తిప్పేసుకుంది, చూశావా" అనుకుని ఆనందంలో మునిగిపోయాడు కృష్ణారావు. ఇలా కాస్సేపు చూపులు జరిగేసరికి కృష్ణారావుకి ఉద్రేకం ఎక్కువయి పోయింది. ఈ ఉద్రేకం ఊరికినే రాలేదు. ఏవేవో బుర్రలో ఊహించుకోవటంవల్ల నరాల్లో వేడి బయల్దేరి, మెదడులో సంచలనం వచ్చింది.

"ఒకమాట మాట్లాడవలసి ఉంది. ఇలారా" అన్నట్టుగా వ్రేలుచూపిస్తూ చేయి ఊపేడు, ఆమె అర్థమవక తెల్లబోయి చూసింది. అతనికి భయంవేసి ఇంకోవైపుకు మొగం త్రిప్పేసుకున్నాడు, మళ్లీ ఆమెవైపు చూసేసరికి, ఆమెకూడా మొగం ఇతనువైపు త్రిప్పింది, ఫరవాలేదనుకొని, మళ్ళా అదే ఉద్దేశం ఇస్తూ, వేలు చూపిస్తూ చేయి ఊపేడు, ఆమె "ఏమిటంటున్నాడూ" అన్నట్టుగా కనుబొమలు కుంచించి చూసింది. అతనలానే పైకిలేచి, ఇలారా. ఒకమాట ఉంద"న్నట్టుగా సంజ్ఞలు చేసాడు, ఆమె "ఏమిటి" అన్నట్టుగా పిడికిలి బిగించి చేత్తో అడిగింది. ఇదంతా ఎవరైనా చూసేరేమో అని అటు ఇటూ చూసి "రమ్మ"న్నట్టుగా, "మాటుంది" అన్నట్టుగా చేతులతో తనూ అన్సరు ఇచ్చేడు. ఆమె లేచింది. రీడింగురూము వెనక్కి వెళ్ళింది. తనుకూడా వెళ్ళేడు

కృష్ణారావు, సుశీల తన ఎదురుగా రావటంతోనే కొద్దిగా ఆదోలా అయిపోయాడు. ఓ ప్రక్కన గాబరా, మరోప్రక్కన ఏం మాట్లాడుదామని ఆలోచన, ఇంకో ప్రక్కన కార్యం సఫలమవబోతున్నదని సంతోషం, అతనికి భయమూ దడ, పుట్టించేయి, ఆమె, "ఎందుకు పిలుస్తున్నావ్" అంది.

"అబ్బే.. అబ్బే...." అని తడుముకుంటున్నాడతను.

"ఊరికే చెయ్యి ఊపుతూ పిల్చావెందుకూ"

"అబ్బే! ఏమీలేదు. ఒకమాట మాట్లాడుదామని" అని ఊరుకున్నాడు ఊరుకున్నవాడు ఊరుకోక, ఆమె కళ్ళల్లోకైనా చూడకుండా తలవంచుకుని ఉన్నాడు ఆమె "ఓహో! అలానా" అని అనేసి, గబగబ, వెనుకనుంచి చెంగును చేతి మీదికి విసురుగా తీసుకుని వెళ్ళిపోయింది. ఆ మాట విని తలపైకెత్తి, కళ్ళల్లోకి చూసి, ఏమో చెప్పాదామనుకున్న కృష్ణారావుకి, ఆమె తల్లో పువ్వులు గబగబా వెళ్ళిపోవటం కన్పడింది. ఆమె వాలు జడవైపు మతిపోయి, అర్థంలేకుండా తీక్షణంగా చూసి, ఏమనుకున్నాడో అక్కడే పచ్చికలో కూర్చుండి పోయాడు, "ఏమిటిది, ఎందుకు పిల్చేవని అడిగి వెంటనే వెళ్ళిపోయింది" అనుకున్నాడు. కాని వెంటనే "ఎందుకు వెళ్ళిపోతున్న మనిషిని ఆపి, మాట్లాడేను కాదా" అని విచారించేడు. "సరే మొత్తంమీద, ఆ అమ్మాయి తన పిలుపుని అందుకుంది. వచ్చింది. ఎందుకంది. తనేమో చవటలా ప్రవర్తించేడు. తలయినా ఎత్తకుండా "ఓమాట చెప్పదామ:

పిల్చేను" అని అర్థంలేకుండా మాట్లాడేడు. పోనీ, ఆమాట ఏమిటో చెప్పెయ్యవల్సింది, చెప్పెయ్యాల్సిందే కాని, తనకు "ఆమాట" ఏమిటో తెలిస్తే నేగదూ! మరెందుకు పిల్చేడు? అతనికే తెలియదు. ఇలాకాక్కాదు ఈసారి ఏమి చెప్పాలో ఊహించుకుని, సిద్ధం చేసుగుని, రెడీ అయికాని పిలవగూడదు. తను పిలిస్తే వచ్చిందంటే మనిషి, ఇక తనకు పని సులువయిందన్నమాట. తనే అనవసరంగా పాడుచేసుకున్నాడు, ఇకనయినా ధైర్యంగా ప్రవర్తించాలి, ఎలాయినా తనమీద ఆపిల్లకు "లవ్" ఉంది. లేకపోతే తను అలా పిల్చినంతల్లోనే వచ్చేస్తుందా? అని మనసులో తర్కించుకుని కొంత కుదుటబడ్డాడు.

ఇంటికి వెళ్ళిపోయాడు. భోంచేస్తున్నాడు ప్రక్కన తమ్ముడు కూర్చుని ఉన్నాడు. వాడి దారిన వాడు అన్నం తింటున్నాడు. ఇక కృష్ణారావు అన్నం తింటూనే సుశీల గురించి ఆలోచన్లో పడ్డాడు. ఆ ఆలోచనలో "తను సుశీలను ప్రేమిస్తాడు, ఆమె కూడా అతన్ని ప్రేమిస్తుంది- ఎలా ప్రేమిస్తుంది? అది చాలా విచిత్రంగా జరుగుతుంది. తను సెకండు ఇయర్‌లో ఉన్నాడు. ఆమె చూస్తే ఫస్టు ఇయర్ చదువుతుంది. అయినా ఆమె ఇతన్ని నోట్సు అడుగుతుంది. ఎందుకంటే కాస్త ఎడ్వాన్సుగా ఉండామని, ఇతన్ని నోట్సు అడిగి అవి రాసుకుని ముందుగానే సబ్జెక్టులో ప్రిపేరయి ఉందామని అడుగుతుంది ఆమె ఆ అడగటం బ్రిటిష్ హిస్టరీ నోట్సు అడుగుతుంది. ఎందుకంటే ఆ నోట్సు చెప్పిన లెక్చరరు చాలా బాగా "డిక్టేటు" చేసేడని ప్రతీతి. అవి చాలా బాగుంటాయి. ఇప్పుడాయన ట్రాన్సుఫర్ అయిపోయాడు, అందుకని మంచివి గనుక, ఆ నోట్సు అడుగుతుంది, ఇతను ఇస్తాడు- అవి తీసుకుని త్వరగా ఇవ్వదు. కనబడినపుడల్లా 'ఎక్స్క్యూజ్‌మి' అంటుంది- ఇలా ఉండగా ఆవేళ ఎప్పటిలాగే తను మధ్యాహ్నం ఇంటికి వెళ్ళడు. వెళ్ళకుండా క్లాసు రూమ్‌లోనే కూర్చునిఉంటాడు, ఆమె ప్యూన్‌చేత అతన్ని పిలిపిస్తుంది. 'ఏమండీ! ఇంటికి మీరు ఎప్పుడూ వెళ్ళరా ఏమిటి?' అంటుంది- "అవును, ఇల్లు దూరమని, మధ్యాహ్నం కాఫీ తాగేసి ఇక్కడే ఉండిపోతాను" అంటాడు- ఇతన్ని ఆమె ప్యూన్‌చేత పిలిపించి, గరల్స్ వెయిటింగు రూమ్‌కి కాస్త దూరంలో ఎవరూ రానిచోట కలుసుకుంటుందన్న మాట- ఇతనికి "అయితే ఇది తిన"మని,- ఇంతవరకూ వెనక చేతితో దాచి ఉంచిన ఉప్మా పొట్లం ఇస్తుంది- "అబ్బే! ఎందుకూ" అంటూనే తీసుకుంటాడు- తింటూ ఆమె కళ్ళల్లోకి చూస్తాడు- ఆమె కూడా చూస్తుంది- ఏదో భావం స్ఫురించినట్టు, తృప్తిగా, కొంటెగా, ఇద్దరూ నవ్వుకుంటాడు- తరువాత "మీనోట్సు ఇచ్చేస్తాను, సాయంత్రం మా ఇంటికి ఓసారి రాకూడదా" అని వెళ్ళిపోతుంది- ఆవేళ సాయంత్రం ఆమె బండి వెనకాలేతనూ సైకిలుమీద బయల్దేరి ఇల్లు గుర్తు పెట్టుకుని, వెళ్తాడు. ఇక అక్కడనుంచి రోజూ వెళ్తుంటాడు- ఇద్దరూ అలాగే సర్దాగా కాలం గడుపుతూంటారు- ఒకనాడు ఆమెతో మాట్లాడుతూ తను ఊరికే సిగరెట్లు కాల్చేస్తాడు- ఆమె అతన్ని "అదేమిటి. అలా సిగరెట్టుమీద సిగరెట్టు కాల్చేస్తావ్- గుండెకు జబ్బుచేయదూ" అంటుంది. తను దానికి ఎంతో సంతోషిస్తాడు- అయినా వెంటనే ఆ సంతోషం పైకి చూపించడు. ఏదో ప్రపంచానికి తనకూ సంబంధము లేనట్టు పోజు పెట్టాడు- నిరాశాజీవిలాగ నటిస్తాడు- వేదాంతిలాగ అభినయిస్తాడు- ఆ అభినయంలో సినిమాలో హీరోలాగ, పెద్దపిచ్చివాడులా పోజు పెట్టి "నన్నుచూచి నీవు నిజంగా సామభూతి చూపుతున్నావా? ఈ విశాల ప్రపంచంలో ఇంతవరకూ నాగురించి ఎవ్వరూ విచారించలేదు నేను సిగరెట్టు కాల్చినందుకు ఎవ్వరూ బాధపడలేదు, కాని ఇన్నాళ్ళకు నీవొక్కదానివి కనపించావు" అని "హా! హా! హా!" అని పెద్దగా నవ్వుతాడు- అందుకని అన్నంతింటూ, ఇప్పుడు, ఆ నవ్వుకు

రిహార్సలు వేసుకున్నాడు. ఎలా నవ్వితే బాగుంటుందో అలాగ నవ్వి చిన్న ప్రయోగం చేసేడు. ఇదంతా, ప్రక్కన కూర్చుని తిండితింటూన్న తమ్ముడు చూసి హడలిపోయాడు. ఇదేమిటి. అన్నం తింటూ వీడిలా నవ్వుతున్నాడు చెప్మా, ఎదురుగా ఏమీలేపు కూడా. అని "ఒరే! అదేమిటలా నవ్వుతున్నావు" అని తొడమీద ఒక్కటి కొట్టాడు. దెబ్బతోటి కృష్ణారావు ఊహా ప్రపంచంలోంచి వాస్తవిక జగత్తులోకి దిగేడు. కొద్దిగా తడబడి, వెంటనే తమాయించుకుని, "ఏమీ లేదురా" అని, తలవంచుకుని తిండితినడం మొదలు పెట్టేడు.

మరునాడు మళ్ళా మీటింగు జరిగింది. కృష్ణారావూ, సుశీలా మళ్ళీ అలాంటి చూపులు చూసుకున్నారు. ఈ వేళైనా ధైర్యంగా పనిచేయాలని. నిన్నటిలాగే మళ్ళా పిలిచేడు సుశీలని, ఆమె వచ్చింది. ఈసారి కృష్ణారావు నిన్నటిలాగ తలవంచుకుని నిలబడలేదు. ధైర్యంగా ఆమె కళ్ళల్లోకి చూసేడు.

ఆమె, "ఎందుకు మళ్ళా పిలిచేవు" అంది

"అబ్బే ఏమీలేదు, సర్దాగా మాట్లాడుదామని" అన్నాడు.

"ఏం మాట్లాడుతావు" అంది.

కృష్ణారావు, "ఏం మాట్లాడుదాం" అని ఇంకా లోపల అనుకుంటూండగనే, ఆమె చరచరా వెళ్ళిపోతూంది. "ఇదిగో" అన్నాడు. ఆమె వెనక్కి మెల్లిగా తిరిగి "రేపు మాట్లాడుదువు గానిలే" అని అనేసి వెళ్ళిపోయింది. కృష్ణారావు అటూ ఇటూ చూసాడు. ఎవరో కుర్రాళ్ళు అటు వస్తున్నారు. "ఒహో! వాళ్ళు చూస్తారని భయంవేసి కాబోలు వెళ్ళిపోతూంది" అని సరిపెట్టుకున్నాడు మొదటిసారి కూడా ఇలానే వెళ్ళిపోయింది కాబోలు తెలుసుకోలేక పోయాననుకున్నాడు.

మరునాడు ఏ మీటింగూ జరుగలేదు. మామూలుగా సుశీల, కృష్ణారావులు మాత్రం ఒకర్నొకరు చూసుకున్నారు. ఇతని కళ్ళు ఏమేమో మాట్లాడుకున్నాయి, ఆమె కళ్లూ మాట్లాడేయి.

నాలుగో రోజున ఇద్దరూ కాలేజీ విడిచిపెట్టేక తారసిల్లారు, అది మధ్యాహ్నం. కుర్రాళ్ల ఇళ్ళకు పోయారు. కృష్ణారావు ఇంటికి వెళ్ళని మూలాన్ని ఉండిపోయాడు, ఆమె లేబరేటరీలోంచి వస్తూంది, కృష్ణారావు ఎదురుగా వెళ్తున్నాడు. ఆమె వైపు 'ఐడియా'తో చూసేడు, ఆమె బుర్రవంచుకుని ముందుకు జరిగిపోయింది కృష్ణారావు వెనక్కి, తిరిగి, తిరిగి చూస్తూ నడుస్తున్నాడు. ఆమె వెళ్ళిపోయేదల్లా గబుక్కున వెనక్కి తిరిగింది. ఇతన్ని చూసింది. ఆగిపోయింది, ఇలారమ్మని పిల్చింది. హుషారెక్కి పోయాడు. కృష్ణారావు నాలుగు అంగల్లో వెళ్ళి కలుసుకున్నాడు. "ఏం" అన్నాడు.

"నావైపు ఎందుకలా చూస్తావు, మాట్లాడితే" అంది,

"నేను చూస్తున్నట్టు నీకెలా తెలుసు నావైపు నీవు చూడకుండా" అని ఫస్టుక్లాసయిన ప్రశ్న వేసాడు కృష్ణారావు.

'తెలివైన ప్రశ్న వేసేసాననుకుంటున్నావా' అంది.

'లేదు'

'ఇంకా తెలివిగా జవాబిచ్చే ననుకుంటున్నావా' 'లేద' ని.

'అంతకంటే లేదు'

'అయితే నావైపు ఎందుకలా చూస్తావు, అర్థంలేకుండా' అడిగిందే అడిగింది ఆమె,

'నీవెందుకు చూస్తున్నావు'

'నీవు చూస్తున్నావు కాబట్టి'

'నేనూ అంతే' అన్నాడు కృష్ణారావు.

'ఏదో ఇష్టంవచ్చినట్టు మాట్లాడేయకు మరి: నావైపు ఎందుకు అలా చూట్టం నీవు' గింజుకుంది, ఆ అమ్మాయి

'ఎన్నిసార్లు వేస్తావు అప్రశ్న. నేను మళ్లీ అదేమాట అంటాను—నీవూ చూడకుండా, నేను చూస్తున్నట్టు నీకెలా తెలిసిందీ అని'

'నిజమే నేను చూడబట్టే తెలిసింది' ఒకదారిలోకి వచ్చింది సుశీల

'అయితే ఎందుకు చూసావు?'

'చెప్తావిను, అసలు ఇటువంటి సంఘటనలు ఎలా జరుగుతాయో—నేను ఎందుకో అలా చూసాను. నీవు నావైపు చూస్తున్నావు. నీవే

కాదు ప్రతియువకుడికీ ఇది అలవాటు. ఏమిటంటే, కనబడిన ప్రతి స్త్రీని. ఏమాత్రం బాగున్నా, ఎగాదిగా చూట్టం మీకున్న లక్షణం. అదే అలవాటులో నీవూ చూస్తున్నావు. నీలానే మరికొంత మందీ చూస్తుంటారు. ఆవేళ మీటింగులో చాలామంది కూర్చున్నాం కాబట్టి, ఆడవాళ్లు అందరూ వైపూ ఒక్కసారే చూట్టం పడదు కనుక, ఒక్కొక్కడు ఒక్కొక్క అమ్మాయిని చూస్తుంటాడు అలాగే నీదృష్టి అప్పుడు నావైపు ఉండి ఉంటుంది నేను నిన్ను చూసాను. భ్రమించేసుకున్నాను. మామూలుగా ఎందుకో అలా చూసాను, నీవు కనబడ్డావు, మామూలుగానే మొగం త్రిప్పేసుకున్నాను మళ్ళా ఎందుకో చూసాను నీవు అలానే చూస్తున్నట్టు కనబడ్డావు. అప్పుడు కాస్త నిన్ను గుర్తుపట్టాను. ఎందుకిలా చూస్తున్నాడా అనిపించింది. కాస్సేపు ఊరుకున్నాను నిజం చెప్పొద్దూ, సాధారణంగా "మనిషి"లో ఉన్న బలహీనత ప్రకారం. ఇంకా చూస్తున్నాడా లేదా అని, నెమ్మదిగా తలఎత్తిచూసాను. నీవు అలానే చూస్తున్నావు. నేను అలా నెమ్మదిగా తలెత్తి చూట్టంలో నీవు ఏమేమో ఊహించుకుని ఉంటావు ఎందుకంటే అమూపు అలాంటిదని చెప్పాలి, ఇక అక్కడనుంచి నేను, సామాన్యంగా మనలో కనపడే దౌర్బల్యంవల్ల, కుతూహలంవల్ల రెండుమూడుసార్లు నీవైపుచూసాను 'నీవింకా అలానే చూస్తున్నావా' అని నీకు అక్కడ ఓవిధమైన అభిప్రాయం ఏర్పడుతుంది. ఇలా కొంతసేపు జరిగేటప్పటికి నాకొక ఉద్దేశ్యం వచ్చింది—నిన్ను చూసి ఏడిపించాలని. కాని నీవు 'ఏడవ్వు' దాన్ని 'లవ్'గా తీసుగుని, నీ అభిప్రాయాన్ని దృఢపర్చుకుని, నన్ను రమ్మన్నట్టు కేక వేసావు. అలా రెండుసార్లు మీటింగుల్లోనూ పిల్చేవు. నేను వచ్చినట్టేవచ్చి నీకు 'గ్రేడు' ఇచ్చి వెళ్ళిపోయే దాన్ని' అని ఊపిరి తిరక్కుండా పెద్ద మనస్తత్వవేత్తలా, తెలివంతా ఉపయోగించి చిన్న ఉపన్యాసం దంచేసింది సుశీల.

'అయితే, మీటింగులో జరిగిన సంగతి గురించి చెప్పావు. అంతకుముందు ఎప్పుడూ నన్ను చూడలేదూ' అన్నాడు కృష్ణారావు.

'చూడలేదు'

'జ్ఞాపకం తెచ్చుకో! ఆవేళ, సోమవారం అనుకుంటాను, కాలేజీ తీసిన రోజున, సుభద్ర నీతో నాగురించి ఏమిటో చెప్తూంది కదూ'

'అవును, ఆవేళనుంచీ నిన్ను ఎరుగుదును అయితే ఏమంటావ్' అంది.

'మరి ఇంకేం, ఎరగనంటావేం' దొరికిందిరా దొంగ అనుకున్నాడు కృష్ణారావు.

"అయితే ఏమంటావు ఇప్పుడు, నిన్ను "లవ్" చేసి ఏడుస్తున్నా ననుకున్నావా? మీలో ఉన్న దౌర్బల్యమే ఇది. నాకు తెలుసు ఆవేళనుంచీ నీవు నన్ను వెంబడిస్తున్నావని- జాగ్రత్త! అసలు మీ కుర్రాళ్ళు మా ఆడపిల్లలకే మీ ప్రపంచం అంటే తెలియదనీ. మీ బుర్రలాంటివి మావి కావనీ అనుకుంటారు- మీ గురించి మాకు లోతయిన భావాలు ఉండవనీ. మేము ఆడవాళ్ళం గనుక ఉత్తి ఆడవాళ్ళం అనీ, మేము ఎందుకూ పనికిరామనీ, మీరు ఎన్నిచేసినా మేము అర్థం చేసికోలేమని, ఇంకా చాలా చాలా తుక్కు అభిప్రాయాల్తో మమ్మల్ని తేలిగ్గా చూస్తారు. యెప్పుడూ అలాంటి ఉద్దేశ్యాలు పెట్టుకోకు- ఆవేళ నీగురించి సుభద్ర చెప్పింది, నీదొడ్డికాళ్ళు గురించి దొడ్డికాళ్ళతో నీవు వంకరగా నడుస్తూంటే మేము చెప్పుకుని నవ్వుకున్నాం- ఇప్పటికైనా అర్థం అయిందా నీకూ"

కృష్ణారావుకి కళ్ళు కనబడ్డం మానేసాయి, కాళ్ళక్రింద భూమి కదలిపోతున్నట్టనిపించింది- గొంతుక తడి ఆరిపోయి- నోరు వణికిపోతూంది. అతని ఆశలు నిలువునా కూలిపోయాయి- అతనికి అవమానంతో, తల బరువెక్కిపోయింది- అతనికి చచ్చిపోదామా అనిపించింది- గట్టిగా అరిచి, పరిగెత్తుకు పారిపోదామనిపించింది- అతనికి పెద్ద భయం పట్టుకుంది- సుశీల అతని ముఖలక్షణాలు పరీక్షగా చూస్తూంది-

"ఆయితే ఇప్పుడు నామీద ప్రిన్సిపాల్‌తో రిపోర్టు చేస్తావా?" అని పొడిగొంతుకతో నిర్జీవంగా, నిరాశగా అన్నాడు కృష్ణారావు,

సుశీల గబుక్కున అతని చేయిపట్టుకుని "యెప్పుడూ చెప్పను కృష్ణారావు" అని ముద్దు పెట్టుకుంది.